కథ

# జై భారత్

రహమతుల్లా

**సారే జహాసే అచ్ఛా... హిందూ సితా హమార హమారా...**

**ఆ ట్యూన్‌లో ఏం మహిమ ఉన్నదో- వినిపిస్తే చాలు ప్రాణం లేచి వస్తది. అందుకే దాన్ని సెల్ రింగ్‌గా కూడా పెట్టుకున్నాను. అసంకల్పితంగానే ఆ చరణం ఎన్ని లక్షలసార్లు పాడుకుని ఉంటానో! మైండు వేరే ఏ పనిలో లేనప్పుడల్లా, నాకు తెలియకుండానే దాన్ని హమ్ చేస్తుంటాను.**



'హలో! నేను కైసర్ని... ఎవరు మాట్లాడుతున్నారండి?

'ఒసేయ్.. నీకింకా బుద్ధి రాలేదే. ఐనా, మీకు బుద్ధి వస్తుందని అనుకోవటం మా పొరపాటు... అమ్మాదాబాదును వెలగబెట్టడం అయిందా? భాగ్యనగర్ వేంచేసావ్? ఒసేయ్ దొంగ... నీకిదే చివరి వార్నింగ్... ఇంకో మీటింగ్‌లో మాట్లాడావంటే, అదే నీ చివరి ప్రసంగమౌతుంది... బీ కేర్‌ఫుల్. టక్.

'హలో...హలో...'

ఎవరితను? నోరు తెరిస్తే పచ్చి బూతులు. ఎన్నిసార్లు బెదిరిస్తాడు నిన్ను మాట్లాడనివ్వకుండానే మొబైల్ ఆఫ్ చేస్తుంటాడు. ఒకసారి మాట్లాడనిస్తే బాగుండు. ఒరేయ్ వెధవా! నీ బెదిరింపులకు భయపడే స్థితి ఎప్పుడో దాటిపోయా[నా]... అయినా, ఇంకా మీరు నన్నేం చేయగలరు? మహా అయితే, ఇంకో అలగా గుంపుకు కిరాయిచ్చి, వెంటేసుకుని వస్తారు... మరోసారి రేప్ చేస్తారు. అంతేగా? అది మీకూ కొత్తకాదు... మాకూ కొత్త కాదు... మీరు చంపటం... మేము చావటం... మామూలైపోయిందిరా... అప్పుడేం చేస్తాడూ?

ఏం మాట్లాడాలో తెలియక తికమకపడతాడు. ఇంకో రెండు బూతులు తిట్టి నోరు మూసుకుంటాడు. బెదిరించి ప్రయోజనం లేదనుకుని ఊరుకుంటాడు. అవకాశం కొరకు కాచుక్కూచుంటాడు. ప్రస్తుతమైతే ఏం చేయాలో తెలియక నెత్తి గోడకేసి బాదుకుంటాడు. భలే భలే.

***

హోటల్ గదిలో టీపాయ్ చుట్టూ నలుగురు కూర్చుని ఉన్నారు. ఎదురుగా ఉన్నామె ముంబయ్ నుంచి వచ్చింది. మిగిలిన ఇద్దరూ ఇక్కడి హైదరాబాదువాళ్లు. రేపు జరగబోయే సభను వాళ్ళే నిర్వహిస్తున్నారు. నలుగురూ స్వచ్ఛంద మహిళా సేవికలే. చాలా సంవత్సరాల నుంచీ సభల్లో సమావేశాల్లో అప్పుడప్పుడు కలుస్తూ ఉన్నారు. మంచి స్నేహితురాళ్ళు కూడా అయిపోయారు. రేపటి సభను గురించిన చర్చ నడుస్తున్నది. తను మాత్రం కిటికీలో నుంచి బయటకు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నది. ఒక పందికొక్కు ఉరుకుతూ కనిపించి, పూలమొక్కల్లో అదృశ్యమైపోయింది. పందికొక్కులు... పందికొక్కులు... ఆలోచన అటు మళ్లింది.

ఆ ఘాతుకం జరిగి ఏడు సంవత్సరాలైపోయింది. పది మంది మగమృగాలు. మదమెక్కిన మతోన్మాదులు. కాళ్ళ మీద, చేతుల మీద ఏనుగుల్లా నిలబడి నలుగురు. పందికొక్కుల్లా మధ్యలో ఇంకోడు. దగ్గరలో పెద్ద మంటలు. అత్యాచారం అయిపోయి నాక ముక్కలుగా నరికి మంటల్లో విసిరి పారేస్తున్నారు. మనుషులు కాలిపోతున్న కమురువాసన. పందికొక్కులు వరుస కట్టాయి. మధ్యలోనే స్పృహ కోల్పోయాను. చచ్చిందనుకునో, మరెందుకనో నరక్కుండా వెళ్ళిపోయారు. అప్పటినుంచి అవే చేదు జ్ఞాపకాలు. నేనూ కాలుంటే బావుండేది, మానసిక నరకం తప్పేది. అంతేకాదు, బూడిదై గాల్లో రేణువుల్లా ఎగిరి ఆ రాక్షసుల కండ్లల్లో దూరి మంట పెట్టేదాన్ని. ఇప్పుడేమీ చేయలేకపోతున్నాను.

***

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్-

పేరుకు తగ్గట్టు ఏ తోటలానో ఉండి ఉంటే ఎంత బాగుండేదో. సభలు చెట్ల కింద పెట్టుకోవాలి. ఖుల్లంఖుల్లా మాట్లాడుకోవాలి. 'ఇప్పుడు కైసర్ మాట్లాడుతుంది' వేదిక మీది అధ్యక్షుడి ప్రకటన.

ఆలోచన ఎడతెగని ధార. తన పేరు పిలుస్తున్నా, సరిగ్గా విననీకుండా చేస్తున్నది. ధారకు అడ్డుకట్ట వేస్తుండాలి. దృష్టిని ప్రసంగం మీద ఉంచాలి.

'సలామలేకుమ్! నా పేరు కైసరున్నిసా బేగమ్. నేను గుజరాతీ ముస్లిమ్‌ను. అదృష్టమో, దురదృష్టమో కాని, అప్పటి జనోసైడ్‌లో బతికి బట్టకట్టిన బాధితురాలిని. ఇప్పుడు ఆ సంఘటన చరిత్రయిపోయింది. ప్రపంచమూ మరచిపోయింది. హంతకులకు శిక్షలు పడనేలేదు. దర్జాగా తిరుగుతున్నారు. పైగా బాధితులే కేసుల్లో ఇరికించబడి, జైళ్ళలో మగ్గుతున్నారు. న్యాయపోరాటం చేస్తున్న నా లాంటివారి చుట్టూ సమస్యల వలయం. అక్కడ మొట్టమొదటినుంచీ అంతే. న్యాయం లేకుండా పోయింది. నా కుటుంబం మొత్తాన్ని నరికేసారు. సాక్ష్యం కావాలంటే మా వాళ్ళ శరీర భాగాలు సైతం ఏరుకొచ్చి పోలీసుల ముందు పడేసాను. అయినాసరే, కేసు రిజిస్టర్ చేసుకోకపోగా, నా తమ్ముడ్ని లోన పడేసారు. ఆ హింస, బాధ చెప్తూ చెప్తూ తట్టుకోలేక రెండు మూడుసార్లు వేదికల మీదే కుప్పకూలి

పోయాను. మానసిక నిపుణుల సలహా మేరకు వాటి జోలికి లోతుగా పోకుండా మాట్లాడుతున్నాను. ఇంకా ఎన్నో విషయాలు చెప్పాలని ఉంది. సమయము లేనందున ముగిస్తున్నాను.

సభ జల్దిగనే అయిపోయింది. బాగానే జరిగింది. కొంచెంసేపు అలా షికారుగా తిరిగి హోటల్‌కు పోవాలి. టాంక్‌బండ్ మీద విగ్రహాలు వరుసగా పెట్టించాలనే ఆలోచన ఎవరిదో. అద్భుతం. మగ్దుం మొహిద్దీన్ అచ్చం బాషాలానే ఉన్నాడే.. బాషాదీ హైదరాబాదే... కలవాలి. ఎంత మంచివాడో. తెలుగు రచయితలు, కళాకారులతో కలసి బాధితులను పరామర్శించిపోదామని వచ్చాడు. ఎనిమిది రోజులుండి, బండెడు బాధల్ని, కొండెడు దుఃఖాల్ని మోసుకుంటూ అందరూ వెళ్ళిపోయారు. బాషా పోలేదు. పోలేకపోయాడు. అట్లానే షా ఆలం శిబిరంలో శరణార్థులకు సేవలు చేసుకుంటూ ఎనిమిది నెలలుండిపోయాడు. మొట్టమొదటి నెల ప్రధానంగా నా గురించే ఉండిపోయాడు. తను శిబిరానికి చేర్చబడిన రోజే అతనూ వచ్చాడు. అతనే లేకపోతే తను ఒక్క నెలలోనే మనిషి అయ్యేది కాదు. ఇంకో రెండు మూడు నెలలు పట్టేది. అసలు బతికేదే కాదేమో. ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకునే మూడ్ నుంచి డీవియేట్ చేసాడు. రోజూ మూడు పూటలా ఎలానో ఒకలా అన్నం సంపాయించేవాడు. అతను తినని రోజులు చాలానే ఉన్నాయి. దొరకనప్పుడు తనకు పెట్టి పస్తులు పడుకున్నాడు. ఆ నా మానసిక స్థితిలో ఏమీ పట్టించుకోలేదు. కొన్నిసార్లు తనే ముద్దలు చేసి తినిపించాడు. పెద్దలు చూసి తిడతారేమోనని భయపడి చింతచెట్టు మొదలు చాటుకు తీసికెళ్ళి తినిపించేవాడు. రాత్రిళ్ళు చీకట్లో తీసుకెళ్ళి తినిపించేవాడు. అతనెప్పుడు గుర్తొచ్చినా వెంటనే, చచ్చిపోయిన తన అమ్మ గుర్తొచ్చేది. మా యమ్మెప్పుడు గుర్తొచ్చినా బాషా గుర్తొచ్చేవాడు. అతను మగవాడే కాని తల్లి మనస్సున్నవాడు. నేను కోలుకున్నాక ఇద్దరం బాధితులకు సహాయం చేస్తూ, సేవలు చేస్తూ గడిపాం. మాట్లాడుకోవటానికి సమయమూ, శక్తీ ఉండేవి కావు. విపరీతమైన పని. అమిత దుఃఖం కల్గించే సంఘటనలు. అయినా ఇద్దరం కలసి పనిచేయటంలో ఏదో తెలియని అనిర్వచనీయ సాంత్వన పొందాం. రేపు వెళ్ళిపోతాడనగా, బాషా నాతో మాట్లాడాడు. కైసర్... మిమ్మల్నందర్నీ ఈ స్థితిలో వదిలిపోవాలంటే ఏడుపు వస్తున్నది. కాని తప్పటం లేదు. నీకు ఎప్పటినుంచో ఒక విషయం చెప్దాం... చెప్దాం అనుకుంటూనే చెప్పలేదు. నువ్వు మరోలా భావించవద్దు. నేను నీ మీద జాలితో మాత్రమే ఈ మాట అనటం లేదు. నిజంగానే నిన్ను చూసినప్పటి నుంచీ నాలో ఏదో ఉద్వేగం కలుగుతూ వచ్చింది. తర్వాత తర్వాత అది ప్రేమని అర్థం అయింది. నీకూ సమ్మతమైతే నాతో రా. హైదరాబాద్‌కు పోయాక పెండ్లి చేసుకుందాం, లేదంటే ఈ శిబిరంలో ఇప్పుడే చేసుకుందాం... నీ ఇష్టం...

ఆశ్చర్యమేసింది. భయమేసింది. సంతోషమేసింది. వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాను. అక్కడ్నుంచి వెళ్ళిపోయాను. ఆలోచనలో పడిపోయాను. చివరికి ఇలా అనుకున్నాను. ప్రేమించకబడటానికేమోగాని, ప్రేమించటానికి మాత్రం మహా శక్తి కావాలి. ప్రస్తుతం నేనా స్థితిలో లేను. కనుక బాషాను ప్రేమించలేను. దానికన్నా ముఖ్యమైన విషయం, నా ఆలోచనల్లో మార్పు. ఎంత మార్పు. ఎడారిలో పడున్న చేపపిల్ల చెరువులో వచ్చి పడ్డట్లయింది. ఇస్లాం చట్రం నుంచి స్వేచ్ఛా వలయం. దాంతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోవటంలోనూ, జీవితాన్ని చూసే దృష్టిలోనూ ఎంతో మార్పు వచ్చింది. చుట్టూ ఉన్న సమాజాన్ని అందమైన చమన్‌లా చూడాలి. మతాలకతీతంగా మనుషుల్లో ప్రేమానురాగాలు పెరగాలి. నిందితులు, రాక్షసులు శిక్షింపబడాలి. వీటికై ఎంతోమంది స్త్రీలూ రాత్రనకా పగలనకా పని చేస్తున్నారు. నేనూ ఆ బాధ్యతను స్వీకరించి పని చేయాలి. పది మంది కోసం బతకటంలోనే గొప్పదనముంది. నాకు ఉపశమనమూ ఉంది. పెళ్ళి, కుటుంబం నాకు అడ్డవుతాయి. బాషాకు నేను ఆనందాన్ని ఇవ్వకపోగా, విషాదాన్ని మిగులుస్తాను.

ఇవన్నీ చెప్పకుండా, ఒకటే మాటన్నాను. ముఝే మాఫ్ కరనా, మై షాదీ నై కర్

**అతనే లేకపోతే తను ఒక్క నెలలోనే మనిషి అయ్యేది కాదు. ఇంకో రెండు మూడు నెలలు పట్టేది. అసలు బతికేదే కాదేమో. ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకునే మూడ్ నుంచి డీవియేట్ చేసాడు. రోజూ మూడు పూటలా ఎలానో ఒకలా అన్నం సంపాయించేవాడు. అతను తినని రోజులు చాలానే ఉన్నాయి. దొరకనప్పుడు తనకు పెట్టి పస్తులు పడుకున్నాడు. ఆ నా మానసిక స్థితిలో ఏమీ పట్టించుకోలేదు. కొన్ని సార్లు తనే ముద్దలు చేసి తినిపించాడు.**

సక్‌తీ. బాషా ముఖం చిన్నదైపోయింది. చాలాసేపు ఆలోచిస్తూ, బాధపడుతూ ఉండిపోయాడు. ఉదయం పోతూ పోతూ చేతిలో చేతిని తీసుకుని పెదాలతో సున్నితంగా స్పర్శించాడు. దేవుడు నాకు ప్రేమలో ఇంతే ఇచ్చాడనుకుంటాను అనేసి వెళ్ళిపోయాడు. నిజం ప్రేమతో ముద్దిడితే స్వర్గమే. ప్రాణం పోయినట్లు అనుభూతి కలుగుతుంది. జ్ఞాపకాలు ఆపి ముందు ఫోను చేసి రమ్మనాలి.

'హలో... బాషానా? సలామలేకుమ్... నేను కైసర్‌ను... మీ ఊళ్ళోనే ఉన్నాను... మగ్దూం సాబ్ విగ్రహం దగ్గరున్నాను... పనేమీ లేకపోతే ఒక గంట వచ్చిపోరాదూ?



బాషా ఏం మారలేదు. అప్పటిలానే ఎంతో ఆత్మీయంగా మాట్లాడుతున్నాడు.

చార్మినార్ నుంచి రావాలట. ఈ గంట టాంకుబండు అందాల్ని తిలకించాలి.

హుస్సేన్‌సాగర్ చుట్టూ విద్యుత్తు బల్బులతో ఒక నెక్లెస్ ఆకారం కాంతిమయంగా వెలిగిపోతున్నది ఆకాసంలోని పున్నమి చందమామకు పోటీ పడుతూ. రాతిదిమ్మె మీది బుద్ధుడు పైనే కాకుండా నీటిలోనూ ధగధగ మెరిసిపోతున్నాడు. ప్రేమికుల పచార్లు, పిల్లల కేరింతలు శోభాయమానంగా ఉన్నాయి. మనసు పులకించిపోతున్నది, బాషా ఆలస్యంగా చేరుకోవాలని కోరుకుంటు



న్నది.

అచ్ఛే దోస్త్‌కి ఖయాలోమే
సజావట్ హుయీ ఖూబ్‌సూరత్ జగామే
ఇంతెజార్ భీ ఏక్ బడీ కిస్మత్

వహ్‌వా... వహ్‌వా... నీకూ షాయరీ వచ్చేస్తున్నది! ఆహ్లాదంగా, విశ్రాంతిగా ఉంటే ఎవరికైనా కవిత్వం వస్తుందనుకుంటా. అది లేకున్నా కూడా, బాషా లాంటివాళ్ళు బాధ్యతగా భావించి కూడా చెప్తారు. శిబిరంలో ఒక రాత్రి నన్ను చూస్తూ చెప్పిన కవిత్వం ఎంత బావుందో... తనప్పుడు బాధితుల సహాయార్థం ఎవరో మహానుభావులు పంపిన వైట్ డ్రెస్‌లో ఉంది. తల్లో మల్లెపూలున్నాయి. శిబిరంలోని చెట్టు నుంచి పిల్లలు తెంపి ఇచ్చినవి. నన్ను చూసి కాసుకో ఈ షాయర్ బాషా ఒక కవిత వదులుతున్నాడు. తనను ఉల్లాసంగా ఉంచటానికి జోకులో, కవితలో, మాటలో చెప్పుండేవాడు.

పున్నమి యమునా నదిలో
తాజ్‌మహల్ మీది చందమామ
తెల్లటి షట్‌సల్వార్‌లో
మా కైసరున్నిసమ్మ

ప్రేమ జ్ఞాపకాలు ఎన్నేళ్ళయినా సజీవంగా గుర్తుండిపోతాయ్. వాటిని గుర్తు చేసుకోవటం ఆనందమో, దుఃఖమో ఇప్పటికీ అర్థం కాదు. కాని ఆత్మీయులు ఎన్ని సంవత్సరాల తరువాత కలుసుకున్నా మొన్నమొన్ననే కలుసుకున్నట్లు మాట్లాడుకుంటారు. వారి గురించిన ఆలోచనలు నిరంతరం నడుస్తూ ఉండడం వల్ల కాబోలు.

'హలో! కైసర్ బావున్నావా? ప్రస్తుతం ఏం చేస్తున్నావ్? జీవితం ఎలా నడుస్తుంది? అసలెక్కడుంటున్నావ్?' బాషా ఉద్వేగంగా, వడివడిగా అడిగేసాడు.

'ముంబయ్ కేంద్రంగా ఒక సామాజిక సేవా సంస్థలో పని చేస్తున్నాను. ప్రధానంగా ప్రజల్లో మత సామరస్యాన్ని పెంపొందించటం దాని ప్రధాన లక్ష్యం. గుజరాత్ 'ఇన్సిడెంట్స్' జరిగినప్పటినుంచి ఆ ఆశయంతో దేశం మొత్తం తిరుక్కుంటూ పని చేస్తున్నాం. నా విషయాలు సరే... నీ విషయాలు ఏమిటి? పెళ్ళయిందా? నువ్వేం చేస్తున్నావ్? కొంచెం బక్కపడ్డట్లు, డల్‌గా ఉన్నట్లు కన్పిస్తున్నావే?' కైసర్ సున్నితంగా బాషాను చూస్తూ అడిగింది.

'అక్కడ్నుంచి వచ్చాక ఏవో రెండు మూడు ఉద్యోగాలు చేసాను. కానీ దేనిలోనూ కుదురుగా ఉండలేకపోయాను. పెళ్ళి చేసుకోలేదు. సమాజం పనులు అంకితభా

**'బాషా నేను రేపు ముంబయ్ వెళ్ళిపోతున్నాను. నువ్వూ నాతో వచ్చేయరాదూ? మనిద్దరం కలసి పని చేద్దాం. రెండు చేతులకన్నా నాలుగు చేతులైతే ఎక్కువ సేవ చేయగలుగుతాయి. నలబై చేతుల్ని కూడదీసి పని చేయించగలుగుతాయ్'**

వంతో చేయటానికి కుటుంబం, పెళ్ళి అడ్డు వస్తాయనుకున్నాను. నేనూ నీ లాగానే మన కమ్యూనిటీ పనులూ, కమ్యూనల్ హార్మోని పెంచే పనులు చేస్తున్నాను. అయినా ఎందుకో ఒక తెలియని అసంతృప్తి ఉంటున్నది. చేయాలనుకుంటున్నట్లుగా, చేయాల్సినంతగా పనులు అవటం లేదు'.

'బాషా నేను రేపు ముంబయ్ వెళ్ళిపోతున్నాను. నువ్వూ నాతో వచ్చేయరాదూ? మనిద్దరం కలసి పని చేద్దాం. రెండు చేతులకన్నా నాలుగు చేతులైతే ఎక్కువ సేవ చేయగలుగుతాయి. నలభై చేతుల్ని కూడదీసి పని చేయించగలుగుతాయ్' కైసర్ అడిగింది. కండ్లు మూసుకుని బాషా ఆలోచించుకుని, ఎంత నెమ్మదిగా కండ్లు తెరుస్తున్నాడో, ముని తన ధ్యానం పూర్తయ్యాక తెరుస్తున్నట్లు.

'సరే, బట్టలవీ సర్దుకుని రేపు మీ హోటల్లో కలుస్తాను. నీతో కలసి ఉండటానికీ, అదే సమాజానికి ప్రయోజనకరమైన పనులు చేయటానికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు' చెప్పాడు.

ఆహ్! బాషా నిజంగా భాషానే. తల్లిని, ఇంటిని, ఊరిని విడిచి ఎక్కడో దూరంగా మందికొరకు పని చేయటానికి ఎంత సింపుల్‌గా ఒప్పుకున్నాడు. బాషా లాంటి ఏ కొందరన్నా నా నుంచి మాకు ఎదిగి ఆలోచిస్తున్నందునే సమాజం ఈ మాత్రమన్నా ప్రశాంతంగా ఉంటున్నది. ప్రగతి వైపు పయనిస్తున్నది.

***

ఈ ప్రయాణంలో హైదరాబాద్ నుంచి ముంబయ్‌కు చేరటం ఒక్కటే జరగలేదు. బాషాతో ఎన్నెన్ని మాటలో... ఆత్మీయ సంభాషణలు అంతరాంతరాల్లోని వత్తిడిని తరిమేస్తాయి.

ఇప్పుడెంత హాల్కాగా ఉన్నదో! అరె అప్పుడే ముంబయ్ వచ్చేసిందే. జనమంతా స్టేషన్లోనే ఉంటారా, ఏంది. ఎప్పుడు చూసినా ప్లాట్‌ఫాంలన్నీ ప్రయాణీకులతో కిటకిటలాడుతుంటాయ్. బాషా ఎంత మంచివాడో. తన బ్యాగు కూడా తీసుకుని ముందుగానే దిగేసాడు. బోగీలోనే ముఖం కడుక్కుని, స్టేషన్లోనే గరమ్ గరమ్ చాయ్ తాగేసి, ఆఫీసుకు పోవాలి. బాషాను అందరికీ పరిచయంచేయాలి. ఖచ్చితంగా అతను అందరికీ నచ్చుతాడు. ఇద్దరం ఎంతో పని చేస్తాం. అందరూ ఎంత సంతోషపడతారో.

జయ్... జయ్...

రైల్వే నల్లాల్లో నీళ్ళు ఎంత ఫోర్సుగా వస్తాయో. ధాం... ధాం...

అబ్బ ఎంత భయంకరమైన శబ్దాలో! చెవులు పగిలిపోయినట్లున్నాయి. రైలే అదిరినట్లయింది.

హృదయవిదారకపు జనం ఆర్తనాదాలు... అరుపులు... ఏడుపులు.... గావుకేకలు... ధమాకా... బాంబ్ ధమాకా...

దేవుడా... దేవుడా... ఇన్ని శవాలా... నడవటానికే దారి లేకుండా మనుషుల అవయవాలు... అయ్యో... బాషా... బాషా... ఎక్కడున్నావ్... ఎక్కడున్నావ్... అయ్యో నువ్వు కూడా మాంసం ముద్దలైపోయినావా.... దేవుడా ఎవరు ఎవర్ని చంపుతున్నారు... అసలు ఛస్తున్నదెవరు.... ఏమాశిస్తున్నారు, అసలేం జరుగుతున్నది. వాళ్ళనుకునేది సాధ్యమయ్యేదేనా... ఈ ప్రయాణీకులంతా చచ్చిపోయినారే... వీళ్ళు చేసిన పాపమేంటి... ఒక తీవ్రవాదం తనను నాశనం చేసింది, మరొకటి బాషాను బలి తీసుకుంది. అతను బతికుంటే ముస్లిములకే మేలే. సమాజానికే మేలే. మరయితే ఎందుకు చంపుతున్నట్లు. ఏమీ అర్థం గాకుండా ఉంటున్నది. ఈ చచ్చిపడిన మనుషుల మీది నుంచి నడుచుకుంటూ నేనెటు పోవాలి? ఏది నా దారి? ఎన్ని ఘాతుకాలు జరగనీ, నా దేశం గొప్పది. దాని కోసమే పని చేయాలి. మేరా భారత్ మహాన్

సారే జహాసే అచ్ఛా హిందూ సితా హమారా హమారా...

•